# ఆహార్యసిద్ధి

నాలుగు వీధులవతల ఉన్న పిన్నత్తగారింటికి పేరంటానికి వెళ్ళింది కొత్తగా కాపరానికొచ్చిన ఊర్మిళ. బాగా పొద్దుపోయింది. పేరంటాళ్ళు అట్టే మంది లేరు. ఎవరెవరో ఒక్కొక్కరే వస్తున్నారు. వెళ్తున్నారు. చిన్నాడపడుచు చిరునవ్వు నవ్వుతూ కాళ్ళకి పసుపు రాస్తోంది.

ప్రక్కన కూర్చున్నావిడతో మాటలు కలుపుతూ "మిమ్మల్నెక్కడో చూసినట్టుందండీ? మీరెక్కడ వుండేది"? అని అడిగింది ఊర్మిళ.

ఆవిడ నవ్వుతూ "ఎక్కడ చూసుంటారు? మాది ఢిల్లీ. నాల్గురోజుల క్రితమే 'ట్రాన్స్ఫర్' అయి ఈ ఊరు వచ్చాము. మూడో రోడ్డులో చివర డాబాలో వుంటున్నాము" అంది.

"అలా చెప్పండి మాపక్క వీథే మీది" అని "మీ పేరు?" అడిగింది ఊర్మిళ.

"మోహిని!" చెప్పిందావిడ.

"మీకు తగిన పేరు" అని శనగలు చేతిరుమాల్లో కడుతూ "మీవారేం చేస్తుంటారు?" అడిగింది ఊర్మిళ.

"ఇంటెలిజెన్స్ ఆఫీసరు!" లేవడానికి కుపక్రమించింది మోహిని.

తనూ లేస్తూ "నా పేరు ఊర్మిళ. మావారు డాన్సు కాలేజీ ప్రిన్సిపాలు!" ఆవిడ అడక్కపోయినా చెప్పింది ఊర్మిళ.

"అలాగా? వారి పేరు?" ఆసక్తిగా అడిగింది మోహిని. "వెళ్లొస్తా నత్తయ్యా" అని లోపలికో కేకేసి, భర్త పేరు చెప్పింది ఊర్మిళ.

"అంటే...దట్ డాన్సింగ్ డైనమైట్ లక్ష్మణ్ కాదుగదా?" అంది మోహిని కళ్ళు పెద్దవి చేసి.

నడుస్తున్న ఊర్మిళ తల ఓరగా తిప్పి, కనుకొసల నుంచి అదొక విలాసంగా చూస్తూ "ఔనాయనే!" అంది.

మోహిని కళ్ళల్లో హఠాత్తుగా వంద మెరుపులు మెరిసినాయేమోనని అనిపించింది ఊర్మిళకి.

మోహిని మొదలెట్టింది; "మీవారూ, మావారూ చాలా దగ్గరి స్నేహితులండి! మీవారు ఆమధ్య ఒకసారి ఢిల్లీలో ప్రోగ్రాంకి వచ్చినపుడు మా యింట్లోనే దిగారు! ఆయన సత్యభామ వేషం! ఓహ్! ట్రెమండస్! పిచ్చెక్కిపోయారనుకోండి ఢిల్లీలో మొగాళ్ళంతా. ఆయన మొగాడంటే మొదట నేను నమ్మలేకపోయాను సుమండీ. చివరికి ప్రోగ్రాం అయిపోయి రాత్రికి యింటికి వస్తూంటే నమ్మక తప్పింది కాదుగాని....."

"ఇంకా నయం....." ఊర్మిళ స్వగత మందహాసం.

మోహిని చెప్పుకుపోతోంది; "మీకు తెలుసో తెలీదో కానీండి, ఆయన చీర కడతారు! అబ్బ! సుపర్బ్! అసలు ఆడవాళ్ళు అందరూ ఆయన్ని చూసి నేర్చుకోవాలని నా అభిప్రాయం. ఏదో మా ఆయన బలవంతం మీద కట్టడమే గాని, నాకిప్పటిదాకా చీర కట్టడమే రాదంటే నమ్మండి. ఆయనున్న రెండ్రోజులూ ఒక్కో స్టైల్‌తో ఆయన కట్టి చూపించడం, నేను నేర్చుకోవడం, యిదే పని."

ఊర్మిళలోని స్త్రీ సన్నగా యిబ్బందిగా కదిలింది.

"ఇప్పుడీ కట్టిన స్టయిల్ ఉందే! ఇది మాత్రం ఎంత ట్రై చేసినా నావల్ల కాలేదు. చివరికి ఆయనే ఎంతో శ్రమపడి తనే నాల్గయిదుస్తార్లు విప్పి నాకు కడితేగాని నాకు రాలేదు. ఇప్పుడెలా వుంది? బాగా కుదిరిందా?".

"మైగాడ్!" ఊర్మిళకి మతిపోయింది. చీకట్లో చిలిపిగా అడిగినట్లుంది. మోహినిని చూస్తే.

ఊర్మిళ నుంచి వెంటనే సమాధానం రాకపోయేసరికి "ఏమండీ! బాలేదా?" నిరాశగా అడిగింది మోహిని.



"ఎబ్బెబ్బే! అదేం లేదండి. బ్రహ్మాండంగా వుంది. మీ విగ్రహానికి, మీ అందానికి తగిన 'స్టైల్' ఎప్పుడూ ఇదే కట్టండి" ఉపచారానికి అన్నా, ఏదో యిబ్బందీ, అసూయా ధ్వనించాయి ఊర్మిళ గొంతులో.

"మీరు చాలా కలుపుగోలుగా, ఎంత చక్కగా మాట్లాడతారండీ!" అనీ, ఈ రోడ్లోనేనా మీ యిల్లు?" అడిగింది మోహిని. "ఔనండి! ఇహ నే ఉంటాను!" అని "మళ్ళీ కలుద్దాం" అన్నట్టుగా ఓ నవ్వు నవ్వింది ఊర్మిళ.

"పదండి నేనూ వస్తాను. ఇంతదాకా వచ్చి మీ యిల్లు చూడకుండా వెళ్ళడమా? ఆయన రావడానికి ఇంకా టైముందిలెండి" అంది మోహిని. ఆహ్వానించాలని తన కనిపించక పోయినందుకు సిగ్గుపడిపోయింది ఊర్మిళ. మోహినిని తీసుకెళ్ళి తన భర్తకి వచ్చిన అవార్డులూ, బిరుదులూ, బహుమతులూ, తమ యిల్లూ అన్నీ చూపించింది. బెడ్‌రూమ్ చూస్తూ మోహిని చొవరగా టేబుల్ మీదవున్న లక్ష్మణ్ ఫోటో ఫ్రేముని చేతుల్లోకి తీసుకుని "ఓహ్!" అంటూ మంచం మీద పడుకుంది.

ఆశ్చర్యం వేసింది ఊర్మిళకి. ఏమిటీవిడ వింత ప్రవర్తన! తన భర్తతో ఎంత పరిచయం ఉంటేమటుకు తన దగ్గర యిలాగా ప్రవర్తించడం? ఇలాగా మాట్లాడటం? ఛీ! సిగ్గులేకపోతే సరి! అయినా పరాయిమగాడి చేత చీరకట్టించుకునే ఆడది యిలాకాక యింకెలా ప్రవర్తిస్తుంది?అయినా ఆ పరిచయం చీర వరకేనో?యింకా...ఛ!ఛ! ఈవిడెలాటిదయినా తన భర్త అలాటివాడా? కాదే! అయినా ఈ మగవాళ్ళని నమ్మమన్న దెవర్లే?!

ఊర్మిళ అలా అనుకుంటూండగా "రియల్లీ హీ ఈజ్ మార్వెలస్! కదూ! వూర్మిళా?" అంది మోహిని, పరవశంగా లక్ష్మణ్ ఫోటో గుండెలకి హత్తుకుంటూ

అరికాలి మంట నెత్తికెక్కింది ఊర్మిళకి "చూడండి మోహినీ దేవిగారూ! ఎరక్కపోయి మిమ్మల్ని పలకరించాను. మీరు చాలా అందగత్తెలే గాని, మీకు ఎక్కడ ఎలా "బిహేవ్" చెయ్యాలో తెలిసినట్లు లేదు. ఇప్పటికే చాలా పొద్దుపోయింది. మా ఆయన వచ్చే వేళయింది. మీ ఆయన కూడా వస్తారేమో? ఇహ లేద్దామా?" మర్యాదతో కూడిన ఒక విసురుంది ఊర్మిళ కంఠధ్వనిలో.

మోహిని దిగ్గున మంచంమీది లేచి, "ఎవరే మీ ఆయన?" అంటూ ఊర్మిళ నడుం చుట్టూ చెయ్యివేసింది.

ఊర్మిళ అదిరిపడి, ఒకడుగు వెనక్కి వేసి, చెయ్యి విడిపించుకోబోయింది.

ఈలోగా మోహిని, రెండో చెయ్యి కూడా ఆమె నడుం చుట్టూ వేసి దగ్గిరికి లాక్కుంది.

ఆశ్చర్యపడిపోతూ మోహిని కళ్ళల్లోకి చూసింది ఊర్మిళ. ఆ కళ్ళూ, ఆ చేతులూ తనకి బాగా సుపరిచితమే!

విరగబడి నవ్వుతూ, జడ ఉన్నపళంగా తీసి మంచంమీద పడేసి, "ఇప్పుడు చెప్పు! ఎవరే మీ ఆయన?" అన్నాడు లక్ష్మణ్.

అవాక్కయిపోయి, గుడ్లప్పగించి చూస్తూ అలాగే ఉండిపోయింది ఊర్మిళ.

"మీరు స్త్రీ వేషం వేస్తే మీ అమ్మగారు కూడా గుర్తుపట్టలేరట గదా! నేనైతే చిటికెలో, చిటికెలో పట్టేస్తా! మీరెంత, మీ వేషం ఎంత అని సవాల్ చేసావు గదా? ఏదీ పట్టు?" అంటూ విజయగర్వంతో ఆమెని ఒడిసి పట్టుకొని పైకెత్తాడు లక్ష్మణ్.

సిగ్గుల బరణి అయిపోయిన ఊర్మిళ, జగన్మోహనములైన చూపుల్తో పరాజయ మొప్పుకొని, శయ్యమీద వాలిపోయింది. ఆ రాత్రికి లక్ష్మణ్ వేషంచేత మాత్రమే స్త్రీగా మిగిలిపోయాడు.